క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీచెన్నకేశవ స్వామి కల్యాణం

కొండాపురం : మండల పరిధిలోని కె.సుగుమంచిపల్లె గ్రామంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం వేదపండితులతో ఘనంగా నిర్వహించినట్లు శనివారం ఆలయ నిర్వాహకులు తెలిపారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని కన్యతీర్థ క్షేత్రంలో వెలసిన మహాత్రిపుర సుందరీదేవి అమ్మ వారిని జేష్ట శుద్దపౌర్ణమి సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు 108 రకాల పిండి వంటలు సమర్పించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గురుకులంలో సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

తొండూరు : మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో బర్తీకాని సీట్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తొండూరు ప్రిన్సిపాల్ ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల బర్తీకి ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 27న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఏ పాఠశాలలో అయితే దరఖాస్తు చేసుకున్నారో ఆ పాఠశాలకు పరీక్షకు హాజరుకావాలన్నారు. హాజరయ్యే విద్యార్థులు ఆధార్ జిరాక్స్ తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. మరిన్ని వివరాలకు గురుకుల పాఠశాలలో సంప్రదించాలన్నారు.

కొండాపురం : మండల పరిధి చౌటిపల్లె పునరావాస కేంద్రం సమీపంలోని డాక్టర్ బీఆర్ అబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతుల ఎస్సీ విద్యార్థునులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కృష్ణవేణి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 25వ తేదీలోపు ఎస్సీ విద్యార్థునులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థునులకు ప్రవేశపరీక్ష నిర్వహించి అడ్మీషన్లు తీసుకుంటామన్నారు.

పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

జమ్మలమడుగు : ప్రజలలో పరిశుభ్రతపై అవగాహన కల్పించేవిధంగా సచివాలయ ఉద్యోగులు చర్యలను చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని సచివాలయ ఉద్యోగులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. డయేరియా వ్యాధి ప్రబలకుండా నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇంటి యజమానులు శుభ్రం చేసుకునేవిధంగా చర్యలను చేపట్టాలన్నారు. ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ బాలమల్లేశ్వర్, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ముందస్తు చర్యలు చేపట్టాలి

చక్రాయపేట : గ్రామాల్లో పారిశుద్య చర్యలు ముందస్తుగా చేపట్టాలని ఎంపీడీవో సోమశేఖర్ తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పారిశుధ్యంపై మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు కార్యాలయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబల కుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్యంపై ప్రజలకు అవగాహణ కల్పించాలన్నారు. తహసీల్దారు బెన్నురాజ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో ఉన్న స్పందన కార్యక్రమాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీ డ్రెస్సెస్టిం) పేరుతో ప్రతి సోమవారం ఉదయం 9:30 గంటలకు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరై ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చక్రాయపేట వైద్యాధికారి వాణి తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

కమలాపురం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో పార్థసారధి తెలిపారు. పథకం ద్వారా మామిడి, చీనీ, సన్ననిమ్మ, సపోటా, జామ, సీతాఫలం వంటి పండ్ల తోటలు పెంచుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గలిగి కుటుంబానికి 5 ఎకరాల లోపు భూమి వున్న చిన్న, సన్నకారు రైతులు తమ భూమికి సంభందించి వన్‌బీ, అడంగల్, పట్టాదారు పాసు పుస్తకం తీసుకుని సంభందిత పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను గానీ లేదా ఉపాధి హామీ కార్యాలయాన్ని గానీ సంప్రదించాలని తెలిపారు.

ప్రతి సోమవారం ఫిర్యాదు చేసుకోవచ్చు

చెన్నూరు జూన్ 22 : ప్రతి సోమవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజా ఫిర్యాదులను అధికారులు స్వీకరించి పరిష్కరిస్తారని తహసీల్దార్ ప్రకాష్ బాబు తెలిపారు. శనివారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు 24వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుంచి తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులను స్వీకరిస్తారని మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

పెరుగుతున్న అరటి సాగు విస్తీర్ణం

- నియోజకవర్గంలో 8 వేల ఎకరాల్లో సాగు
- ఎకరాకు రూ.60 వేలుపైనే పెట్టుబడులు
- 8 నుంచి 12 టన్నుల మేర దిగుబడులు
- సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు



అరటిమొక్కలను కాపాడుకునేందుకు రక్షణగా పెట్టిన ఈతాకులు



సాగులో ఉన్న అరటి పంట

వేముల : నియోజకవర్గ వ్యాప్తంగా ఈ ఏడాది అరటి సాగు విస్తీర్ణం పెరిగింది. జిల్లాలోని పులివెందుల నియోజకవర్గంలో అత్యధికంగా అరటి సాగవుతోంది. ఏడాదికి ఏడాది అరటి సాగు విస్తీర్ణం పెరుగుతూ ఈ ఏడు 15 శాతం మేర విస్తీర్ణం పెరిగిందని ఉద్యానశాఖ అధికారులు అంటున్నారు. ఇందుకు ఒకేరకమైన పంటలు సాగుచేయడం ద్వారా దిగుబడులు తగ్గిపోయి నష్టపోతున్న రైతులు అరటిసాగుకు ఆసక్తి కనపరుస్తున్నారు. అరటిసాగు చేసే రైతులు పొలాలను ముందుగానే దుక్కులు చేసి పశువుల ఎరువులు వేసి సాగుకు సిద్ధం చేస్తారు. అరటిసాగులో ఆదాయం ఉండటంతో రైతులు ఆదిశగా దృష్టి సారిస్తున్నారు.

నియోజకవర్గంలో 8 వేల ఎకరాల్లో సాగు

పులివెందుల నియోజకవర్గంలో అరటిపంట ఎక్కువ విస్తీర్ణంలో సాగైంది. నియోజకవర్గ వ్యాప్తంగా 8 వేల ఎకరాల్లో ఈ ఏడాది రైతులు అరటి సాగు చేస్తున్నారు. ఒకసారి అరటి సాగుచేస్తే మూడు పంటలు తీయవచ్చన్న ఉద్దేశంతో రైతులు అరటిని ఎంచుకుంటున్నారు. నియోజకవర్గంలోని పులివెందుల, లింగాల, తొండూరు, వేముల, వేంపల్లె మండలాల్లో అరటి సాగుచేస్తారు. మే, జూన్, జూలై నెలల్లో ఎక్కువగా అరటిని సాగుచేయడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతినకుండా ముందుగానే దిగుబడులు వచ్చేలా రైతులు అరటిపై దృష్టిపెడుతున్నారు.

వేసవిలో అరటిని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు

అరటిపంట సాగు చేసే సమయంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. అరటి మొక్కలను కాపాడుకునేందుకు రైతుల అవస్థలు అన్నిఇన్నీ కావు. నాటిన అరటి మొక్కలను బ్రతికించుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. అరటి మొక్కలకు ఈత ఆకులను రక్షణగా చేసి ఉష్ణోగ్రతల నుంచి రక్షించుకుంటున్నారు. ఇందుకోసం అదనపు ఖర్చులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. నెలరోజుల పాటు అరటిపంటలను రక్షించుకోవాల్సి వస్తుందని లేదంటే మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.

ఎకరాకు రూ.60 వేలకు పైనే పెట్టుబడులు

అరటి సాగులో పెట్టుబడులు ఎక్కువగా అవుతున్నాయి. ఎకరాకు రూ.60 వేలకు పైనే పెట్టుబడులు పెడుతున్నామని రైతులు అంటున్నారు. ఎకరాకు 1200 మొక్కలను నాటుతున్నారు. ఎక్కువగా జెయిన్, క్యాడిల్లా, మైక్రోసన్, ఎక్స్‌ఎల్, విట్రో, కెఎఫ్‌బయోటెక్‌రీటా కంపెనీలకు చెందిన గ్రాండ్ 9 యాలకి అనే అరటి రకాలను ఈ ప్రాంతంలో ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఒక్కో మొక్కను రూ.12 లతో కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. అరటి మొక్కలు నాటిన మొదలు సస్యరక్షణ చేపడుతూ మొక్కలను కాపాడుకుంటున్నారు. అంతేకాక కలుపుతీయడం, సేద్యాలు, కూలీఖర్చులు, ఎరువులు, తదితర వాటి కోసం అదనపు ఖర్చులు కావడంతో పెట్టుబడులు పెరిగిపోతున్నాయని రైతులు అంటున్నారు.

ఎకరాకు 8 నుంచి 12 టన్నుల దిగుబడులు

అరటిసాగులో దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉంటున్నాయి. ఎకరాకు 8 నుంచి 12 టన్నుల దిగుబడులు అందుతున్నాయి. సాగుచేసిన 10 నెలల తర్వాత దిగుబడులు వస్తున్నాయి. దిగుబడులు అందే సమయానికి ప్రకృతి వైపరీత్యాలతో ఎక్కడ తోటలు దెబ్బతింటాయోనని రైతులలో ఆందోళన ఉంటోంది. తోటలలో అరటిగెలలు కోతకోసే వరకు రైతులకు కంటిమీద కునుకు ఉండదు. ఇన్ని ఆటుపోట్ల నుంచి బయటపడితేనే అరటిలో ఆదాయం ఉంటుందని, లేదంటే పెట్టుబడులు కూడా గిట్టుబాటు కాని పరిస్థితి ఉంటుందని రైతులు అంటున్నారు.



సాగుచేసేందుకు సిద్ధంగా ఉన్న అరటి మొక్కలు

5 ఎకరాల్లో అరటి సాగుచేసా



నాకున్న 5 ఎకరాల్లో అరటిని సాగుచేసా. సాగుకు రూ.3 లక్షలు పైనే పెట్టుబడి పెట్టా. ఒక్కో మొక్కను రూ.12లతో కొనుగోలు చేసి ఎకరాకు 1200 మొక్కల చొప్పున నాటా. దిగుబడులు వచ్చేవరకు సకాలంలో మందులను పిచికారీ చేసి నీటితడులు అందిస్తున్నా. దిగుబడులు పెరుగుతున్నా ఆదాయం ఉంటుందన్న ఆశతో సాగుచేశాం. మార్కెట్‌లో ధరలు బాగా ఉంటే ఆదాయం ఉంటుందని ఆశతో ఉన్నాం.

- శివశంకర్‌రెడ్డి, అరటి రైతు, మబ్బుచింతలపల్లె

అరటిసాగుపై రైతులు ఆసక్తి



గత రెండేళ్లుగా అరటి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో ధరలు నిలకడగా ఉండటం, భూగర్భ జలాలు పుష్కలంగా ఉండటంతో అరటిసాగు విస్తీర్ణం పెరుగుతోంది. చనిపోయిన చీనీచెట్ల స్థానంలో పంట మార్పిడి కోసం రైతులు అరటిని సాగుచేస్తున్నారు. ఒకసారి సాగుచేస్తే మూడు పంటలు తీయవచ్చన్న ఉద్దేశంతో రైతులు ఆదిశగా అరటికి మొగ్గుచూపుతున్నారు.

- జి.రాఘువేంద్రారెడ్డి, హెచ్‌ఓ, పులివెందుల

26న గ్రామపంచాయతీ వేలంపాట

ముద్దనూరు : 2024–25 ఆర్థిక సంవత్సరానికి ముద్దనూరు మేనేజర్ పంచాయతీ వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి వీరభద్రుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు పంచాయతీ పరిధిలోని బస్టాండు, జంతువధశాల, సులభ్‌కాంప్లెక్స్ నిర్వహణలకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బస్టాండు నిర్వహణకు రూ.2లక్షలు, జంతువధశాలకు రూ.20వేలు, సులభ్‌కాంప్లెక్స్‌కు రూ.1000లు డిపాజిట్ చెల్లించాలి. ఆసక్తి గలవారు గ్రామపంచాయతీకి డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని కార్యదర్శి తెలిపారు.

రేపు విద్యుత్ అదాలత్

కమలాపురం : ప్రొద్దుటూరు పట్టణం పవర్ హౌస్ రోడ్డులోని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరుగుతుందని కమలాపురం విద్యుత్ శాఖ ఏఈ చాంద్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నిర్వహిస్తున్న ఈ విద్యుత్ అదాలత్‌ను విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

జమ్మలమడుగు : ఈనెల 24వ తేదీ సోమవారం ప్రొద్దుటూరు పట్టణంలోని పవర్ హౌస్ ఎగ్జిక్యూటివ్ కార్యాలయంలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ రాజాబాబు శనివా రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆదాలత్‌కు రిటైర్డు జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, కె.రామ మోహన్‌రావు, అంజనీకుమార్, ఈశ్వరమ్మలు హాజరవుతున్నారని ఏమైన సమస్యలుంటే విద్యు త్ వినియోగదారులు ఫిర్యాదులు చేయవచ్చు అని సూచించారు.

వైఎస్ జగన్‌కు అడుగడుగునా ఘన స్వాగతం

వేంపల్లె : తాడేపల్లిలోని తన నివాసం నుంచి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక విమానంలో కడప ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అనంతరం రోడ్డు మార్గాన పులివెందులకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో కడప పులివెందుల బైపాస్‌లోని వేంపల్లె హనుమాన్ జంక్షన్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఎంపీటీసీ భారతి హారతులు పట్టారు. అలాగే బైపాస్‌లోని ఫ్యామిలీ రెస్టారెంట్ వద్ద, రాజీవ్‌కాలనీ వద్ద కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై స్వాగతం పలికారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ అభివాదం చేస్తూ ఎవరూ అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండకట్టేలా ప్రజల్లోనే ఉండేందుకు అన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.



ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : కడప జిల్లా పర్యటనలో భాగంగా పులివెందులకు వెలుతున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. కడప విమానాశ్రమం నుంచి పులివెందులకు రోడ్డు మార్గాన బయలుదేరిన జగన్‌ను పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరు, పెండ్లిమర్రి, నల్లయ్యగారిపల్లె, నందిమండలం గ్రామాలల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మాజీ సీఎం నాయకులు, కార్యకర్తలను పలకరించి ప్రజలకు అభివాదం చేసుకుంటూ వెళ్లారు.

వేములలో..

వేముల : వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ మరక శివకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో శనివారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కార్యకర్తలు కలిశారు. కడప నుంచి రోడ్డు మార్గాన పులివెందులకు వెళ్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేములలో కొద్దిసేపు ఆగారు. అనంతరం కార్యకర్తలు జగన్‌ను కలిశారు. అక్కడి నుంచి ఆయన పులివెందులకు బయలుదేరి వెళ్లారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి


పులివెందుల టౌన్ : ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల పూర్తి అవగాహన కల్పించి డైయేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్టాప్ డైయేరియా కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, ఆసుపత్రులు, తదితర పరిసర ప్రాంతాలను, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకునేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. మురుగునీరు పారే ప్రాంతాల్లో, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో నీరు కలుషితం కాకుండా ప్రతిరోజు నీటిసంబంధి అమెనిటీ సెక్రటరీలు క్లోరిన్ టెస్ట్ చేయాలన్నారు. డైయేరియా రాకుండా వాటిపై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా ముందుకు పోవాలన్నారు. ఆహారం తీసుకునేటప్పుడు సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. 5 ఏళ్ల లోపు పిల్లలకు సరైన పోషకాలు అందేలా చూడాలన్నారు. హెల్త్ సెంటర్ల ద్వారా ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. ప్రజలు కూడా నీటిని వేడిచేసి చల్లార్చి తాగాలన్నారు. హోటళ్లలో నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం సరఫరా అయ్యేటట్లు శానిటేషన్ సిబ్బంది తనిఖీలు చేయాలన్నారు. హెల్త్ సెక్రటరీలు చిన్నపిల్లలను గుర్తించి ఇమ్యునైజేషన్, సీజనల్ వ్యాధులు రాకుండా ఫ్రై డే డ్రై డే కార్యక్రమాలను చేట్టాలన్నారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల పూర్తి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ, మెడికల్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

ఎన్నికల రెమ్యూనరేషన్‌లో కోత విధించడం బాధాకరం

కమలాపురం : నియోజకవర్గంలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న వీఆర్‌ఏలకు చెల్లించాల్సిన రెమ్యూనరేషన్‌లో కోతలు విధించడం బాధాకరమని ఏపీ వీఆర్‌ఏల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కమలాపురంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో విధులను నిర్వర్తించిన వీఆర్‌ఏలకు రెమ్యూనరేషన్ అందించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించి డబ్బులను భారీగా తగ్గించి ఇస్తున్నారని అన్నారు. రెండు నెలల పాటు తనతో పాటు కొంత మంది వీఆర్‌ఏలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు ఫ్లయింగ్ స్క్వాడ్ వీడియో గ్రాఫర్లుగా తమ సొంత ఖర్చులతో విధులకు హాజరయ్యామని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతి రోజూ రూ.250 చొప్పున చెల్లించాల్సి వుండగా కేవలం రూ.5 వేలు మాత్రమే ఇచ్చి మిగిలిన మొత్తం బడ్జెట్ వచ్చిన తరువాత ఇస్తామనడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కోడూరు పుల్లయ్య మాట్లాడుతూ ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచి బీఎల్వోల విధులు నిర్వహించామన్నారు. వీరికి కేవలం రూ.1000 ఇవ్వడం అన్యాయమన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఇవ్వాల్సిన రెమ్యూనరేషన్‌ను ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ సంఘ నేతలు మణి కుమార్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ వీఆర్‌ఏల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య

25న గండిలో టెండర్లు

చక్రాయపేట : ఈనెల 25న గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో యేడాది కాలం పాటు పూలు విక్రయించుకొనుటకు, టోల్ గేట్లు వసూలు కొరకు షీల్డ్ టెండరు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ ఆలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలికృష్ణతేజలు తెలిపారు. యేడాది కాలం పాటు హక్కు కల్పించు నిమిత్తం ఈటెండర్లు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. హక్కులను కోరు వారు రూ. 5 లక్షలు చొప్పున దరావత్తు మొత్తం నగదు లేదా దేవస్థానం పేరిట కాని డీడీ రూపంలో చెల్లించి బహిరంగ వేలం పాటలో పాల్గొనాలన్నారు. పూర్తి వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని వారు తెలిపారు.

నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి

కమలాపురం : ఇటీవల విడుదలైన నీట్ పరీక్షా ఫలితాలు దేశంలోని విద్యార్థులందరినీ ఆశ్చర్యానికి గురి చేశాయని, పరీక్షను వెంటనే రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ కమలాపురం మండల నాయకులు సిద్దార్థ అన్నారు. శనివారం కమలాపురంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 68 మంది విద్యార్థులు మొదటి ర్యాంకు పొందడం, గ్రేస్ మార్కులు ఇంప్లిమెంట్ చేయడం, జూన్ 14న విడుదల చేయాల్సిన నీట్ పరీక్షా ఫలితాలను జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ రోజు విడుదల చేయడం వంటి అంశాలు పరీక్ష నిర్వహణలో అనేక సందేహాలకు అద్దం పడుతున్నాయన్నారు. పరీక్ష నిర్వహిస్తున్న ఎన్టీఏను రద్దు చేసి వైద్య విద్య సీట్ల భర్తీకి నిర్వహించే ప్రవేశ పరీక్షను ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

పంట రుణాలను రెన్యూవల్ చేసుకోండి

పెండ్లిమర్రి : వెల్లటూరు సొసైటీలో పంట రుణాలు తీసుకున్న రైతులు గడువులోపు పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని సొసైటీ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రెన్యూవల్‌కు వచ్చే రైతులు వన్‌బీ, ఆధార్‌కార్డు, పాసుపుస్తకం జిరాక్స్‌లు తీసుకునిరావాలన్నారు. అలాగే దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు కంతులు చెల్లించాలని ఆయన కోరారు.

వైభవంగా భీమేశ్వరస్వామి తిరునాల

పెండ్లిమర్రి : మండలంలోని వేలూరుపాడు గ్రామసమీపంలో వెలసిన శ్రీభీమేశ్వరస్వామి తిరునాల ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. ఉదయం స్వామివారికి గణపతి పూజ, అభిషేకాలకరణ, పంచామృతాభిషకం,ఆకుపూజ వంటి ప్రత్యేక కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి కాయ కర్పూరాలతో మొక్కలు తీర్చుకున్నారు. అలాగే 10.30 గంటల నుంచి 12.00 గంటల వరకు శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. కల్యాణాన్ని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని కన్నులారా తిలకించారు. భక్తులకు ఆలయ ఆవరణలో దాతలు సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన ఎద్దుల యాజమానులకు ఆలయ కార్యనిర్వాహకులు బహుమతులు అందజేశారు.



తిరునాలలో బండలాగుతున్న ఎద్దులు

నీటికుంటలలో గంబూషియా చేపపిల్లలు విడుదల

పులివెందుల రూరల్ : పులివెందుల అర్బన్ పరిధి విజయహోమ్స్ సమీపంలోని నీటికుంటలో, చిన్నకుడాల సమీపంలోని నీటికుంటలో శనివారం దోమల నియంత్రణ కొరకు గంబూషియా చేపపిల్లలను విడుదల చేసినట్లు సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య తెలిపారు. జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వర్షాకాలం సీజన్‌లో సహజంగానే దోమలు విజృంభిస్తుంటాయి. ఈ సీజన్‌లో దోమల వల్ల డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధులు ప్రభలుతుంటాయి. అందుకనే ప్రభుత్వ అధికారులు, సిబ్బంది దోమల సంఖ్యను నియంత్రించేందుకు వాటిని నాశనం చేసేందుకు ఈ సీజన్‌లో చెరువులు, చిన్నచిన్న కుంటల్లో నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో గంబూషియా చేపలను వదులుతారన్నారు. దీనిద్వారా దోమల నియంత్రణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : బలపనూరులోని శివాలయం సమీపంలో ఉన్న చెరువులో, అంకాలమ్మ గూడూరు చెరువులో దోమల నియంత్రణకు దోమ లార్వాను ఆహారంగా తీసుకునే గంబూసియా చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య మాట్లాడుతూ ఈ సీజన్‌లో చెరువులు, చిన్నచిన్న కుంటల్లో నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో గంబూషియా చేపలను వదులుతారన్నారు. గంబూసియా చేపలు దోమల్లాగే తక్కువ నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లోనూ పెరుగుతాయని, ఇవి చిన్నపిల్లలుగా ఉన్నప్పుడే వీటిని నీటిలోకి వదులుతారని, దీంతో ఇవి దోమల లార్వాను తిని పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



నీటికుంటలో గంబూషియా చేపలను వదులుతున్న సిద్ధయ్య

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

వేంపల్లె : వాతావరణాన్ని కాలుష్యం బారి నుంచి రక్షించడానికి, భూతాపాన్ని తగ్గించడానికి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలను నాటాలని వేంపల్లె మండల తహసీల్దార్ వెంకటేష్ నాయక్ కోరారు. శనివారం వేంపల్లె ఆవోపా, ఆవోపా మహిళా విభాగ్ సంయుక్త ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం, తలిశెట్టి శేషమ్మ జడ్పీ బాలికల పాఠశాలలో మొక్కలను నాటే కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాయవరం సురేంద్ర, తలిశెట్టి శేసమ్మ, జడ్పీ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నారాయణమ్మ, ఆవోపా అధ్యక్షుడు బైరిశెట్టి వెంకటసునీల్ కుమార్, ఆవోపా మహిళా విభాగ్ అధ్యక్షురాలు ప్రవీణాకిషోర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న తహసీల్దార్ వెంకటేష్ నాయక్

భూసార పరీక్షతో ప్రయోజనాలు

కమలాపురం : రైతులు భూసార పరీక్షలను చేయించుకోవడం వలన అనేక ప్రయోజనాలు వున్నాయని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని విభరాపురం గ్రామంలో భూసార పరీక్షల నిర్వహణలో భాగంగా రైతుల పొలాల్లో వ్యవసాయ సిబ్బంది చేపట్టిన మట్టి నమూనాల సేకరణ ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. మట్టి నమూనా తీయు విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. భూసార పరీక్షల వలన భూమిలోని పోషకాల మోతాదును తెలుసుకోవచ్చని, దాని ద్వారా ఎంత మేర అసరమో అంత మేరకే ఎరువులను ఉపయోగించి సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని తెలపారు. నేల స్వభావాన్ని తెలుసుకోవడం ద్వారా ఆ నేలకు అనువైన పంటలను సాగు చేసి అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఆమ్ల నేలలు, క్షార నేలలను గుర్తించి తమకు అనువైన విధంగా మార్చుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవచ్చన్నారు. కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని కమలాపురం మండలంలో 520, వల్లూరు మండలంలో 460, వీరపునాయునిపల్లె మండలంలో 670, ఎర్రగుంట్ల మండలంలో 530 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్‌బీకేల సిబ్బంది లక్ష్యాల మేరకు రైతుల నుంచి మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షా కేంద్రాలకు పంపాలన్నారు. సమస్యాత్మక నేలలను గుర్తించి వాటి పైన ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మట్టి నమూనాలు సేకరించాలన్నారు. రైతులు ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి మట్టి నమూనాలను తీయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో దస్తగిరి, వ్యవసాయ సహాయకుడు వెంకటకృష్ణ, రైతులు పాల్గొన్నారు.



మట్టి నమూనాల సేకరణను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి